ప్రజాశక్తి

శుక్రవారం 13 జూన్ 2025

5



శ్రీకాకుళం

'పది' సప్లిమెంటరీలో 77.84 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాలను రాష్ట్ర విద్యాశాఖ గురువారం విడుదల చేసింది. జిల్లాకు సంబంధించి సప్లిమెంటరీ పరీక్షలకు 5,139 మంది విద్యార్థులు హాజరు కాగా, నాలుగు వేల మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణతా శాతం 77.84 నమోదైంది. విద్యార్థులు ఈనెల 13 నుంచి 19వ తేదీ వరకు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య తెలిపారు. రీకౌంటింగ్‌కు ఒక్కో సబ్జెక్టుకు రూ.500, రీవెరిఫికేషన్‌కు రూ.వెయ్యి చొప్పున చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ప్రాజెక్టుల్లో కానరాని ప్రగతి

- అసంపూర్తిగా వంశధార పనులు
- మందకొడిగా సాగుతున్న ఆఫ్‌షోర్
- నదుల అనుసంధాన పనులదీ అదే పరిస్థితి
- కదలిక లేని కరకట్టల పనులు



టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా సాగునీటి ప్రాజెక్టుల్లో పెద్దగా పురోగతి కనిపించడం లేదు. వంశధార, ఆఫ్‌షోర్‌లకు బడ్జెట్‌లో కాస్తాకూస్తో నిధులు కేటాయించినా, పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. మిగిలిన ప్రాజెక్టులకు సంబంధించి వంశధార, నాగావళి నదుల అనుసంధానం, వంశధార, నాగావళి కరకట్టల పనుల ఊసే కనిపించడం లేదు. హిరమండలం రిజర్వాయర్ ఎత్తిపోతల పథకం పనుల్లోనూ పెద్దగా పురోగతి కనిపించడం లేదు. లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ మినహా మిగిలిన ప్రాజెక్టులన్నీ 2014-19 కాలంలో టిడిపి హయాంలో ప్రారంభించినవే. ఇందులో వంశధార ప్రాజెక్టు ఫేజ్-2 స్టేజ్-2 పనులు టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటికి 93 శాతం పనులు పూర్తయ్యాయి. ప్రభుత్వం దృష్టిసారిస్తే ఏడాదిలోనే పనులు పూర్తయ్యే పరిస్థితి ఉన్నా, వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తి చేసేందుకు లక్ష్యంగా నిర్ణయించడం గమనార్హం.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార ఫేజ్-2 స్టేజ్-2 ప్రాజెక్టు పనులను రూ.933.90 కోట్లతో 2005లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించింది. 2008 జులై నాటికి 87 ప్యాకేజీ పనులు 31 శాతం, 88 ప్యాకేజీ పనులు 36 శాతం పూర్తయ్యాయి. హిరమండలం రిజర్వాయర్ పనులు 60 శాతం మేర పూర్తయ్యాయి. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం ప్రాజెక్టు పనుల అంచనాలను రూ.1616.23 పెంచింది. 2019 వరకు 87 ప్యాకేజీ పనులు 64 శాతం, 88 ప్యాకేజీ పనులు 81 శాతం, హిరమండలం రిజర్వాయర్ పనులు 87 శాతం పూర్తయ్యాయి. 2019 తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం అంచనా వ్యయాన్ని రూ.2,407.79 కోట్లకు పెంచింది. 87 ప్యాకేజీ పనులు 90 శాతం, 88 ప్యాకేజీ పనులు 94 శాతం, హిరమండలం రిజర్వాయర్ పనులు 94.50 శాతం పనులు జరిగాయి. ఇప్పటివరకు రూ.2062.79 కోట్లను ఖర్చు చేశారు.

మందకొడిగా ఆఫ్‌షోర్ పనులు

టెక్కలి, నందిగాం, పలాస, మెళియాపుట్టి, మండలాల్లోని 24,600 ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2007లో ఆఫ్‌షోర్ రిజర్వాయర్ ప్రాజెక్టును ప్రారంభించింది. హైదరాబాద్‌కు చెందిన ఎస్.వి.ఇ.సి-ఇందు సంస్థతో రూ.123.25 కోట్లతో ఫిబ్రవరి 18, 2007లో ఒప్పందం కుదిరింది. ఒప్పందం ప్రకారం 2008 జనవరి నాటికి పనులు పూర్తి కావాల్సి ఉంది. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం రిజర్వాయర్ పనులను మళ్లీ అదే సంస్థకు అప్పగించింది. ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని సవరించి రూ.466.28 కోట్లకు పెంచింది. ప్రాజెక్టు పనుల పూర్తికి జూలై 7, 2019 వరకు గడువు ఇచ్చింది. టిడిపి ప్రభుత్వం అధికారం కోల్పోయిన నాటికి 38 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత పాత నిర్మాణ సంస్థతో ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. మిగిలిన పనులకు సంబంధించి కొత్త రేట్లతో రూ.852.45 కోట్లకు ఆమోదం తెలిపింది. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటికి 38 శాతం మాత్రమే పనులు పూర్తి కాగా, ఏడాది కాలంలో అదనంగా కేవలం ఏడు శాతం పనులు మాత్రమే జరిగాయి.

అనుసంధానం పనులపై ఆశలు

వంశధార, నాగావళి నదుల అనుసంధార పనులకు రూ.78.96 కోట్లు కేటాయిస్తూ అప్పటి ప్రభుత్వం మార్చి 27, 2017లో పరిపాలనా అనుమతులను మంజూరు చేసింది. ప్రాజెక్టు పనులను నెల్లూరుకు చెందిన పి.వి రమణయ్య అండ్ కంపెనీకి రూ.57.99 కోట్లకు పనులను అప్పగించింది. అనుసంధాన పనులు 2020 నాటికే పూర్తి కావాల్సి ఉంది. పలుమార్లు ఒప్పంద కాలపరిమితిని పొడిగించిన ప్రభుత్వం ఈ గతేడాది డిసెంబర్ 31వ తేదీ నాటికి పూర్తి చేసేలా పొడిగించింది. ఇప్పటివరకు 73 శాతం పనులే జరిగాయి. ఈ పనులూ ఏడాదిలోనే పూర్తయ్యే అవకాశమున్నా, ఇప్పటికీ అదే స్థితిలో ఉన్నాయి. భూములు ఇచ్చిన రైతులకు పరిహారం డబ్బులు, కాంట్రాక్టర్‌కు బిల్లుల బకాయిలు తేలిస్తే పనులు ముందుకు సాగే అవకాశం ఉన్నా ప్రభుత్వం పెద్దగా దృష్టిసారించలేదు.

కరకట్టల పనులు ప్రారంభమయ్యేనా?

వంశధార, నాగావళి కరకట్టల పనులు 2007-08లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రారంభమయ్యాయి. వంశధార కరకట్టలకు సంబంధించి నాలుగు ప్యాకేజీల పనులు 5.66 శాతం నుంచి 21.34 శాతం మాత్రమే పూర్తయ్యాయి. నాగావళి కరకట్టల పనులు 33.32 శాతం పూర్తయ్యాయి. నిర్మాణ సంస్థలు 2010 నుంచి పనులను ఆపేసాయి. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం కొత్తగా టెండర్లను పిలిచి కొత్త నిర్మాణ సంస్థలకు పనులను అప్పగించింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఉన్నపళంగా పనులను నిలిపేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ముంపు తీవ్రత అధికంగా ప్రాంతాలను గుర్తించి అందులో ముఖ్యమైన పనులకు ప్రాధాన్యమివ్వాలన్న ప్రభుత్వ ఆదేశాలతో నాగావళి కరకట్టలకు సంబంధించి అధికారులు తొలుత ఐదు ప్రాంతాలను గుర్తించారు. వాటిలో కరకట్టల నిర్మాణానికి రూ.13.5 కోట్లు అవసరమవుతాయని అధికారులు ప్రతిపాదించారు. వంశధారపై 23 కిలోమీటర్ల మేర కరకట్టలను నిర్మించేందుకు రూ.130 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం కనీసం వాటి జోలికి కూడా వెళ్లడం లేదు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

హామీలు ఎప్పుడు అమలు చేస్తారు?

- ఏడాది పాలనలో సంతృప్తి లేదు
- ప్రజలకు అప్పులు తప్ప ఆదాయం లేని పరిస్థితి
- హామీలు అమలు చేయకుంటే ఉద్యమాలు
- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా, జిల్లాకు ఇచ్చిన ఎన్నికల హామీల్లో ఒక్కటీ ఎందుకు అమలు చేయలేదని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు ప్రశ్నించారు. శ్రీకాకుళం నగరంలోని ఇందిరానగర్ కాలనీలో గల ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి, పి.తేజేశ్వరరావుతో కలిసి గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వ పాలన ఏడాదిలో ఏమాత్రం సంతృప్తికరంగా లేదన్నారు. జనానికి అప్పులు తప్ప ఆదాయం లేని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ఎన్నికల సందర్భంగా జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు చేస్తామని, జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, జీడి బోర్డు ఏర్పాటు చేస్తామన్న హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. వంశధార నిర్వాసితులకు స్పెషల్ ప్యాకేజీ ఇస్తామని, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి చివరి భూముల వరకు నీరందిస్తామని చెప్పి విస్మరించారని చెప్పారు. జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తామని చేసిన వాగ్దానాన్నీ ఎందుకు అమలు చేయలేకపోయారో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సందర్భంగా జిల్లా ప్రజలకు ఇచ్చిన హామీలు ఎప్పటిలోగా అమలు చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఐటిడిఎ లేకపోవడం వల్ల గిరిజనులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, గిరిజనుల భూములను గిరిజనేతరులు తప్పుడు పత్రాలు సృష్టించి ఆక్రమించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీడికి గిట్టుబాటు ధర లేకపోవడంతో జీడి రైతులు తీవ్రంగా దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వంశధార రిజర్వాయరును పూర్తి చేసి చివరి భూముల వరకు రెండు పంటలకు నీరు ఇవ్వాలని, నేరడి వద్ద బ్యారేజీ నిర్మించాలని డిమాండ్ చేశారు. జిల్లా సస్యశ్యామలం కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు స్పెషల్ ప్యాకేజీ ఇవ్వాలని, రిమ్స్ ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అక్రమ మైనింగ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్గో ఎయిర్‌పోర్టు పేరుతో భూ దోపిడీ ఆపాలని, సముద్రతీర ప్రాంతాన్ని కార్పొరేట్లకు అప్పగించే ప్రయత్నాలు మానుకోవాలన్నారు. కోడిరామ్మూర్తి స్టేడియం నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే ప్రజల మద్దతుతో ఉద్యమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ముగ్గురు తహశీల్దార్ల బదిలీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జిల్లా రెవెన్యూ శాఖలో ముగ్గురు తహశీల్దార్లను బదిలీ చేశారు. ఈ మేరకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టరేట్ జి-సెక్షన్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న జి.ఎల్ శ్రీనివాస్‌ను లావేరు తహశీల్దార్‌గా నియమించారు. ఇప్పటివరకు అక్కడ తహశీల్దార్ పనిచేసిన ఆయన విజయనగరం అంతర్ జిల్లా బదిలీల్లో వెళ్లిపోయారు. పాతపట్నం తహశీల్దార్ సనపల కిరణ్ కుమార్‌ను రణస్థలం తహశీల్దార్‌గా, రణస్థలం తహశీల్దార్ ఎం.ప్రసాదరావును పాతపట్నంకు బదిలీ చేశారు.



కౌన్సెలింగ్ హాల్ వద్ద ఉపాధ్యాయులు

కొనసాగుతున్న ఉపాధ్యాయుల కౌన్సెలింగ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

మాన్యువల్ పద్ధతిలో ఎస్‌జిటి ఉపాధ్యాయుల కౌన్సెలింగ్ శ్రీకాకుళం రూరల్ మండలంలోని మునసబుపేటలోని గాయత్రి కళాశాలలో కొనసాగుతోంది. ఒడియా ఉపాధ్యాయులతో పాటు, ఎస్‌జిటిలకు 600 మందికి కౌన్సెలింగ్ నిర్వహించారు. రెండు రోజుల్లో 1150 మంది ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ పూర్తి చేశారు. మొత్తం కౌన్సెలింగ్ మరో మూడు రోజుల పాటు కొనసాగే అవకాశముంది. స్పౌజ్ కోటాలో వస్తున్న సమస్యలు అధికారులు వద్ద ప్రస్తావించినా, స్పందన లేకపోవడంతో ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య కౌన్సెలింగ్‌ను పర్యవేక్షిస్తున్నారు. షెడ్యూల్ మేరకు ఉపాధ్యాయులు కౌన్సెలింగ్‌కు హాజరవుతున్నారు.

అరసవల్లి ఇఒ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఇఒ

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ నూతన కార్యనిర్వహణాధికారి (ఇఒ)గా కె.ఎన్.వి.డి ప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకున్నారు, ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ అర్చకులు ఘన స్వాగతం పలికి, వేద తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కనకరాజు, అట్టాడ శ్రీనివాస్ శోభానాచార్యులు, చక్రవర్తి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

బాలలను కార్మికులుగా పెడితే చట్టపరమైన చర్యలు తప్పవని బాలల సంరక్షణ అధికారి కె.వి రమణ హెచ్చరించారు. స్థానిక నెహ్రూ యువ కేంద్రం వద్ద జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్, బ్రెడ్స్ సంస్థ, కార్మిక శాఖ, ఎహెచ్‌టియు, ఐసిపిఎస్, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సంయుక్త ఆధ్వర్యాన ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా నెహ్రూ యువ కేంద్రం నుంచి డే నైట్ కూడలి వరకు బాల కార్మికుల నియంత్రణపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలను కార్మికులుగా పెట్టినట్లు గుర్తిస్తే 1098, 112కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. జిల్లా యాక్సిస్టు జస్టిస్ ప్రోగ్రాం మేనేజర్ మజ్జి సింహాచలం మాట్లాడుతూ మన దేశాన్ని బాల కార్మిక రహిత దేశంగా తీర్చిదిద్దాలన్నారు. కార్మిక శాఖ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు పిల్లలను పనిలో చేర్చుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం అధికారి వెంకట ఉజ్వల్, ఎహెచ్‌టియు కానిస్టేబుల్ బగాది రాములమ్మ, ఐసిపిఎస్ ప్రతినిధులు గీత, శ్రీనివాస్, మీనాక్షి, మాధవి, బ్రెడ్స్ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పనే ధ్యేయం

ప్రజాశక్తి - పలాస



మాట్లాడుతున్న వెంకన్న చౌదరి

యువతకు ఉపాధి కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పలాస నియోజకవర్గ టిడిపి సమన్వయకర్త వెంకన్న చౌదరి అన్నారు. కాశీబుగ్గలోని సూర్యతేజ కళాశాలలో జిల్లా నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం పరిశ్రమలు ఏర్పాటు చేసి వారికి ఉపాధి కల్పించే ప్రయత్నాలు చేస్తోందన్నారు. గతంలో యువత ఉద్యోగాల కోసం నగరాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు కంపెనీలే వచ్చి మేళాల్లో ఉద్యోగాలు ఇస్తున్నాయన్నారు. జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగ యువత ఉద్యోగావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ పద్మాజీ కామేశ్వరరావు మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధి శిక్షణల ద్వారా యువతకు కొత్త అవకాశాలు లభిస్తున్నాయన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఉరిటి సాయికుమార్ మాట్లాడుతూ ఏ రంగంలో ఉద్యోగావకాశం వచ్చినా దూరంతో సంబంధం లేకుండా అభ్యర్థులు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. మేళాలో 15 ప్రైవేటు సంస్థల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. 763 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా, 263 మంది పలు కంపెనీలకు ఎంపికయ్యారు. వారికి సూర్యతేజ కళాశాల కరస్పాండెంట్ దానేటి పద్మజీ కామేశ్వరరావులు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు నైపుణ్యాభివృద్ధి అధికారి చంద్రమౌళి, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్, ఎల్.కామేశ్వరరావు, టిడిపి పట్టణాధ్యక్షులు బి.నాగరాజు, టిడిపి జిల్లా కార్యదర్శి కృష్ణారావు, ఎం.నరేంద్ర చిన్ని తదితరులు పాల్గొన్నారు.

డిపిఆర్‌ఒగా గోవిందరాజులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



జిల్లా పౌర సంబంధాల అధికారి (డిపిఆర్‌ఒ)గా పి.గోవింద రాజులు నియమితులయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా ప్రభుత్వం ఆయన్ను జిల్లాకు బదిలీ చేసింది. ఇప్పటివరకు ఆయన అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు డిపిఆర్‌ఒగా పనిచేశారు. ఇక్కడ డిపిఆర్‌ఒగా పనిచేసిన బాల్‌మాన్ సింగ్‌ను పాడేరు డిపిఆర్‌ఒగా ప్రభుత్వం బదిలీ చేసింది. నూతన డిపిఆర్‌ఒగా నియమితులైన గోవిందరాజులు 2021లో టెక్కలి డివిజనల్ పిఆర్‌ఒగా, శ్రీకాకుళం ఎపిఆర్‌ఒగా పనిచేశారు. విజయనగరం, విశాఖ, విజయవాడ ప్రాంతాల్లో పలు కేడర్‌ల్లో విధులు నిర్వర్తించారు. ఈయన స్వస్థలం శ్రీకాకుళం నగరంలోని కంపోస్టు కాలనీ ప్రాంతం.

డిఐపిఆర్‌ఒ కార్యాలయంలో పలువురు బదిలీ

శ్రీకాకుళం డిఐపిఆర్‌ఒ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆర్ కేశ్వరమ్మ అనకాపల్లికి, అక్కడ పనిచేస్తున్న పి.మురళీకృష్ణను శ్రీకాకుళానికి బదిలీ చేసింది. టైపిస్టు రాధారాణి సాహును పార్వతీపురం మన్యం జిల్లాకు బదిలీ చేయగా, అక్కడ పనిచేస్తున్న టైపిస్ట్ రాజు, ఆఫీస్ సబార్డినేట్ రామోజీరావును శ్రీకాకుళం కార్యాలయానికి బదిలీ చేసింది.



గ్రామస్తులకు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్న ఎస్ఐ లక్ష్మణరావు

శ్మశాన స్థలంపై వివాదం

అధికారుల జోక్యంతో మరోచోట అంత్యక్రియలు

ప్రజాశక్తి - లావేరు

మండలంలోని బెజ్జిపురం, వెంకటరావుపేట గ్రామాల మధ్య శ్మశాన స్థలంపై కొనసాగుతున్న వివాదం మరింత ముదిరింది. వెంకటరావుపేటకు చెందిన వృద్ధురాలు జగ్గురోతు పార్వతమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబీకులు, గ్రామస్తులు గురువారం అంత్యక్రియలకు ఏర్పాటు చేశారు. కొన్నేళ్లుగా బెజ్జిపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 248.8బి1లోని ఖాళీ స్థలంలో శ్మశాన కార్యకలాపాలు నిర్వహిస్తూ అంత్యక్రియలు చేస్తున్నారు. అదేవిధంగా పార్వతమ్మ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తుండగా, బెజ్జిపురానికి చెందిన పిన్నింటి రాజ్యలక్ష్మి కుటుంబీకులు గ్రామస్తులతో కలిసి అడ్డుకున్నారు. ఆ స్థలం జిరాయతీ అని, తమ స్థలంలో అంత్యక్రియలు చేయడానికి వీల్లేదన్నారు. కొన్నేళ్లుగా తాము ఇక్కడే దహన సంస్కారాలు చేస్తున్నామని, చేయొద్దంటే కుదరని వెంకటరావుపేట గ్రామస్తులు స్పష్టం చేశారు. విషయం తెలుసుకున్న ఆర్ఐ ఆర్.అప్పలరాజు, ఎస్ఐ జి.లక్ష్మణరావు ఘటనాస్థలికి చేరుకుని ఇరు గ్రామస్తులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా అంగీకారం రాకపోవడంతో వేరేచోట ప్రభుత్వ స్థలంలో మృతదేహానికి అంత్యక్రియలు చేయడంతో వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది.

సిపిఐ జిల్లా కార్యదర్శిగా వెంకటరమణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



చాపర వెంకటరమణ

సిపిఐ జిల్లా కార్యదర్శిగా చాపర వెంకటరమణ ఎన్నికయ్యారు. పాతపట్నంలో నిర్వహిస్తున్న సిపిఐ 25వ జిల్లా మహాసభలో గురువారం కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా సహాయ కార్యదర్శిగా లండ వెంకటరావుతో పాటు జిల్లా కార్యవర్గ సభ్యులుగా చాపర సుందరలాల్, ఎస్.నారాయణస్వామి, కె.శ్రీనివాసరావు, పి.ఆరేళ్లమ్మ, ఎస్.హరికృష్ణ, ప్రత్యేక ఆహ్వానితులుగా బి.సంతోష్‌ను మహాసభలో ఎన్నుకున్నారు. 31 మంది సమితి సభ్యులతో పాటు మరో ముగ్గురు కాండిడేట్ మెంబర్స్‌ను ఎన్నుకున్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి సత్యనారాయణ మూర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు.

పిఎం బాల పురస్కార్ దరఖాస్తుల గడువు పెంపు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జాతీయ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యాన నిర్వహించే ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్-2025కు సంబంధించి దరఖాస్తుల గడువును జూలై 31వ తేదీ వరకు పొడిగించినట్లు ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. సాంస్కృతిక, సమాజ సేవ, విజ్ఞానం, సాంకేతికం, పర్యావరణం వంటి రంగాల్లో అసాధారణ ప్రతిభ కనబర్చిన ఐదు నుంచి 18 ఏళ్ల లోపు బాలలు ఈ అవార్డుకు అర్హులని స్పష్టం చేశారు.

బాలలు స్వయంగా గానీ వారికి చెందిన సంస్థల ద్వారా గానీ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసేందుకు అవసరమైన వ్యక్తిగత వివరాలు, ప్రతిభకు సంబంధించిన ధ్రువపత్రాలు, సర్టిఫికెట్లు, పత్రికల్లో ప్రచురితమైన వార్తల క్లిప్పింగ్స్ వంటి ఆధారాలతో https://awards.gov.in/Registration/SignUp పోర్టల్‌లో జూలై 31 లోపు నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హులైన బాలలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

75 అంగన్‌వాడీ పోస్టులకు నోటిఫికేషన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జిల్లాలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తల నియామకానికి జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. జిల్లాలో 16 ఐసిడిఎస్ ప్రాజెక్టుల్లో ఖాళీగా ఉన్న 75 పోస్టులను భర్తీ చేయనున్నట్టు తెలిపింది. ఇందులో 21 అంగన్‌వాడీ కార్యకర్తలు, 53 అంగన్‌వాడీ సహాయకులు, ఒక మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు ఉన్నాయి. అభ్యర్థులు స్థానిక నివాసం కలిగిన వివాహిత మహిళలై ఉండాలి. వయసు 21 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్‌సి, ఎస్‌టి కేంద్రాలకు అర్హులైన అభ్యర్థులు లేకపోతే, 18 ఏళ్ల వయసు నిండిన వారిని కూడా పరిగణించనున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస విద్యార్హత పదో తరగతి, మినీ కార్యకర్తలు, సహాయకులకు ఏడో తరగతి ఉండాలి. దరఖాస్తులను జూన్ 20 సాయంత్రం ఐదు గంటల వరకు సంబంధిత ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాల్లో స్వీకరిస్తారు.

జూన్ 21 నుంచి 23 వరకు దరఖాస్తుల పరిశీలన, జూన్ 24 నుంచి 26 వరకు డివిజన్ వారీగా ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఇంటర్వ్యూలు జరిగే ప్రదేశం త్వరలో తెలియజేస్తారు. ఎంపిక ప్రక్రియలో పదో తరగతికి గరిష్టంగా 50 మార్కులు, వితంతువులు, అనాథలు, వికలాంగులకు రిజర్వేషన్లు, మౌఖిక పరీక్షకు 20 మార్కులు కేటాయించారు. ఎంపికలపై తుది నిర్ణయం నియామక కమిటీకే చెందుతుంది. ఎంపికైన వారు 60 ఏళ్లు నిండే వరకూ విధులు నిర్వహించాల్సి ఉంటుంది.

డిజిపి దృష్టికి బ్లాక్‌మెయిల్ బాగోతం


డిజిపితో ఎమ్మెల్యే శిరీష

ప్రజాశక్తి- పలాస

పలాస నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆసరాగా చేసుకుని కొంతమంది లబ్ధి పొందేందుకు కుట్రలు చేస్తున్నారని, పలు శాఖల అధికారులను బెదిరిస్తూ ఆర్థిక ప్రయోజనం పొందాలని కుయుక్తులు పన్నుతున్నారని డిజిపి హరీష్ గుప్తా దృష్టికి పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తీసుకెళ్లారు. అమరావతిలోని డిజిపి కార్యాలయంలో గురువారం కలిసి పలు ఆధారాలను ఆయనకు సమర్పించారు. బ్లాక్‌మెయిల్‌కు లొంగని వారిపై పలు శాఖల అధికారులకు తప్పుడు సమాచారం ఇవ్వడం, కక్షపూరితంగా వ్యవహరిస్తున్న వారి జాబితాను ఇప్పటివరకు వారు చేసిన అక్రమాల వివరాలను అందజేశారు. సానుకూలంగా స్పందించిన డిజిపి తగు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చినట్లు తెలిపారు.



సామూహిక అక్షరాభ్యాసాలు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

స్థానిక ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గురువారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఆధి ఆంధ్రావీధి అంగన్వాడీ కేంద్రంలో పలువురు చిన్నారులకు అక్షరాభ్యాసం చేపట్టారు. కార్యక్రమానికి జిల్లా ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ హాజరయ్యారు. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలతో మాట్లాడి ఆరోగ్యంపై ఆరా తీశారు. కార్యక్రమంలో టెక్కలి ఐసిడిఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తూరు: స్థానిక అంగన్వాడీ కేంద్రం-1లో చిన్నారులకు అక్షరాభ్యాసాన్ని వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీ వర ప్రసాదరావు చేతులమీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పి.లక్ష్మి, ఎస్.ధనలక్ష్మి, మాజీ సర్పంచ్ వెంకట కృష్ణ ఉన్నారు.



నెలవంకలో చేపడుతున్న పనులు

మరమ్మతులు చేస్తున్నారు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- కవిటి

నెల రోజులుగా నీటి కోసం ఎదురుచూస్తున్న సీమూరు ప్రజల ఆవేదన, పైపులైన్ పాడవడంతో గత రెండు వారాలుగా నీటి కోసం అల్లాడుతున్న వడ్డిపుట్టుగ, బైరెడ్లపుట్టుగ గ్రామస్తుల ఆక్రందన, కపాసుకుద్ది గ్రామంలో పంపు హౌస్ మోటారుకు వెళ్లే వైర్ తెగిపోవడంతో 11 గ్రామాలకు నిలిచిపోయిన నీటి సరఫరా సమస్యలు ప్రస్తావిస్తూ 'అంపశయ్య'పై ఉద్దానం ప్రాజెక్ట్ అంటూ ప్రజాశక్తి ఇటీవల ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. కపాసుకుద్దిలోని ఉద్దానం పంపుహౌస్ మోటారుకు వెళ్లే కరెంట్ వైరును వెంటనే పునరుద్ధరించారు. దీంతో యథావిధిగా మళ్లీ పంపు హౌస్ నుంచి ఆయా గ్రామాలకు నీటి సరఫరా జరుగుతోంది. అదే విధంగా సీమూరు, బైరెడ్లపుట్టుగ, వడ్డిపుట్టుగ గ్రామాలకు నీటి సరఫరా కోసం నెలవంక పాఠశాల వద్ద పాడైన పైపులైన్ మరమ్మతులు చేపడుతున్నారు. తవ్వకాల్లో పైపులైన్ అనుకున్నదానికంటే ఎక్కువ పాడైందని మరో రెండు రోజుల్లో ఆయా గ్రామాలకు నీటిసరఫరా జరుగుతుందని సంబంధిత సిబ్బంది తెలిపారు.


జెసిబితో కాలువల్లో తొలగిస్తున్న పూడికలు

లావేరులో పూడికతీత

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- లావేరు

మండల కేంద్రం లావేరులో ఎట్టకేలకు మురుగు కాలువల్లో అధికారులు పూడికతీత పనులు చేపట్టారు. ఈనెల 9న లావేరులో తాండవిస్తున్న అపారిశుధ్యం అనే శీర్షికతో ప్రజాశక్తిలో కథనం వెలువడింది. దీనిపై ఎంపిడిఒ పి.వెంకటారాజు స్పందించి పంచాయతీ కార్యదర్శి బి.దాలినాయుడును కాలువల్లో పూడికలు తొలగించాలని ఆదేశించడంతో గురువారం జెసిబితో లావేరు మెయిన్ రోడ్డును అనుకుని సినిమాహాలు వరకు ఉన్న కాలువల్లో పూడికలు తొలగించారు. ఇంతవరకు కాలువల్లో నుంచి జలగలు ఇళ్లల్లోకి రావడం, పాములు చొచ్చుకుపోవడంతో ప్రజలు గత కొన్నేళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పూడికతీత పనులు ప్రారంభించడంతో హర్షం వ్యక్తం చేస్తూ ప్రజాశక్తికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి- కవిటి

మలేరియా, డెంగీ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అందులో భాగంగా మండలంలోని ప్రభుత్వ వసతి గృహాల్లో ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎన్.లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని రాజపురం పిహెచ్‌సి పరిధిలో రాజపురపెపి మోడల్ వసతిగృహం, బిసి వసతి గృహం, కొత్తపాలెం గ్రామంలోని కెజిబివి వసతి గృహాల్లో వైద్యాధికారి డాక్టర్ శశిధర్ ఆధ్వర్యంలో గురువారం ఫోకల్ స్ప్రేయింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమవుతుంది కాబట్టి వ్యాధుల తీవ్రత పెరిగే అవకాశం ఉందని, వసతి గృహాల్లో పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ముఖ్యంగా వసతి గృహాల్లో ఉండే విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ, అత్యవసర సమయాల్లో వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిహెచ్‌సిఒ అభిమన్యు సోయి, మలేరియా టెక్నికల్ సూపర్ వైజర్ నగేష్, ఎఎన్ఎం ఉష, ఆశా కార్యకర్తలు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వసతిగృహాల్లో స్ప్రేయింగ్ చేస్తున్న వైద్య సిబ్బంది

ఘనంగా ఏడాది పాలన సంబరాలు


నౌపడ : కేకు కట్ చేస్తున్న నాయకులు

శ్రీకాకుళం సిటీ: స్థానిక విశాఖ కాలనీలో గల టిడిపి కార్యాలయంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా తెలుగు మహిళా అధ్యక్షులు గొండు స్వాతి మాట్లాడుతూ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళ్తున్న పార్టీ టిడిపి అని, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మాదారపు వెంకటేష్, పాండ్రంగి శంకర్, పిఎంజె బాబు తదితరులు పాల్గొన్నారు.

లావేరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదైన సందర్భంగా మండల కేంద్రం లావేరులో టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్ అధ్వర్యంలో చంద్రశేఖర్ స్వామి ఆలయంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ముందుగా ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, ప్రధాన కార్యదర్శి పిన్నింటి మధుబాబు, మురళీమోహన్, శంకర్రావు, నాయకులు లంకలపల్లి శ్రీనువాసరావు, దారపురెడ్డి కూర్మరావు, ఎల్.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: కూటమి ప్రభుత్వం పాలన ఏడాది పూర్తయిన సందర్భంగా పట్టణ, మండల టిడిపి ఆధ్వర్యంలో పుర వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ జంక్షన్ వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కాళ్ల ధర్మారావు, కాళ్ల జయదేవ్, నందిక జాని, టిడిపి మండల అధ్యక్షులు పద్మనాభం, కార్యదర్శి కామేశ్వరరావు, లీలారాణి, సాలీనా ఢిల్లీ, కాళ్ల దిలీప్, నందిగాం కోటి, పాల్గొన్నారు.

కవిటి: రాష్ట్రంలో కూటమి పాలన ప్రారంభమై ఏడాది ముగిసిన నేపథ్యంలో మండల కేంద్రంలో కూటమి నాయకులు వేడుకలు నిర్వహించారు. బస్టాండ్ కూడలిలో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పొందల కృష్ణారావు, నాయకులు మణిచంద్ర ప్రకాష్, బెందాలం రమేష్, సీపాన వెంకటరమణ, బార్ల చినబాబు, ఆరింగి మధు, త్రివిక్రమరావు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైన సందర్భంగా మండల టిడిపి కార్యాయం వద్ద మండల అధ్యక్షులు సూరాడ మోహనరావు ఆధ్వర్యంలో కేకు కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి గొరకల వసంతరావు, దువ్వాడ హేంబాబు చౌదరి, పుచ్చ ఈశ్వరరావు, నెయ్యిల సూర్యనారాయణ, కోనారి కిరణ్ కుమార్, ఉమామహేశ్వరరావు, కర్ని రమణ, శశి, జె జె రావు తదితరులున్నారు.

నౌపడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా కేకును కట్ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జీరు భీమారావు, టిడిపి సీనియర్ నాయకులు కర్రి విష్ణుమూర్తి, అట్టాడ రాంప్రసాద్, బొడ్డేపల్లి సత్యనారాయణ, ఆరంగి వసంతరావు, ఇతర టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా స్థానిక ఎన్‌టిఆర్ భవనంలో టిడిపి నాయకులు సంబరాలు నిర్వహించారు. మాజీ పిఎసిఎస్ అధ్యక్షుడు కింజరాపు ప్రసాద్, టిడిపి మండల అధ్యక్షుడు బోయిన రమేష్ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్, ఎర్రన్నాయుడు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి కర్రి అప్పారావు, మాజీ జెడ్‌పిటిసి నంబాల శ్రీనివాసరావు, ఎంపిటిసి పట్ట సింహాచలం, పూజారి శైలజ, నాగయ్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నరసన్నపేట: కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక ప్రజా సదస్సులో సమన్వయ కర్త బగ్గు అర్చన, కూటమి నాయకుల ఆధ్వర్యంలో కేకు కట్ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పలాస: టిడిపి కార్యాలయంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది సందర్భంగా టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్ రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్, మల్లా శ్రీనివాసరావు, నాగరాజు, నరేంద్ర, రవిశంకర్ గుప్తా, శాసనపురి మురళీకృష్ణ పాల్గొన్నారు.


శ్రీకాకుళం సిటీ : కేకు తినిపిస్తున్న స్వాతి

ఆమదాలవలస: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తికావడంతో పట్టణంలోని టిడిపి కార్యాలయంలో వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీతాసాగర్, కూటమి నాయకులు మొదలవలస రమేష్, బోనెల అప్పారావు, ఆనెపు రామకృష్ణ, పేడాడ సూరపునాయుడు, బోర గోవిందరావు, కణితి విజయలక్ష్మి భాయ్, నాగళ్ల మురళీధర్ యాదవ్, అన్నెపు భాస్కరరావు పాల్గొన్నారు.

టెక్కలి: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది ముగిసిన సందర్భంగా టిడిపి కార్యాలయంలో టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు హనుమంతు రామకృష్ణ, ఎల్.ఎల్.నాయుడు, మట్ట సుందరమ్మ, మట్ట పురుషోత్తం, మెండ దమయంతి, మామిడి రాము, పోలాకి షణ్ముఖరావు, దల్లి ప్రసాద్‌రెడ్డి, రెయ్యి ప్రీతీష్‌చంద్, బసవల అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాల ప్రదానం

రణస్థలం: మండలంలోని వరిసాం పంచాయతీలో అరోబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబడిన స్కిల్ డెవలప్‌మెంట్ సర్టిఫికేషన్ ప్రోగ్రాంలో ఎంఎస్‌సి చదివిన విద్యార్థులకు 'ఫార్మాసిటికల్ క్వాలిటీ కంట్రోల్ అనలైటికల్ టెక్నిక్స్' పై ఆరు నెలల శిక్షణ అందించారు. ఈ శిక్షణ పూర్తయిన సందర్భంగా 12వ బ్యాచ్‌కు చెందిన 28 మంది విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రధానోత్సవ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేనేజ్మెంట్ కన్సల్టెంట్ ఎస్.దయానంద, సీనియర్ జనరల్ మేనేజర్ కమలాకర్ రెడ్డి హాజరై సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఆరు నెలల శిక్షణలో అనుభవజ్ఞులైన అధ్యాపకులచే, అధునాతన యంత్రాలతో ఫార్మా, కెమికల్ రంగాలకు అవసరమైన శిక్షణ అందించడం జరిగిందన్నారు. ఫార్మాస్యూటికల్ క్వాలిటీ కంట్రోల్ అనలిటికల్ టెక్నిక్స్‌పై ఆరు నెలల శిక్షణ ఫార్మాస్యూటికల్ పరిశ్రమలో నాణ్యతను నిర్వహించడానికి, నిర్ధారించడానికి ఉపయోగించే వివిధ విశ్లేషణాత్మక పద్ధతులను అభ్యసించే శిక్షణ కార్యక్రమన్నారు. ఈ శిక్షణలో వివిధ రసాయన, సూక్ష్మజీవి, భౌతిక పద్ధతులను ఉపయోగించి ఔషధాలను పరీక్షించ గలరన్నారు. ఔషధాల నాణ్యతా ప్రమాణాలపై అవగాహన, ఔషధాల నాణ్యతను నిర్ణయించే అంశాలు, ప్రమాణాలు, నిబంధనలను తెలుసుకోవచ్చన్నారు. విశ్లేషణాత్మక పద్ధతులు ఔషధాల నాణ్యతను పరీక్షించడానికి ఉపయోగించే వివిధ పద్ధతులపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ప్రయోగశాల పద్ధతులను ఉపయోగించి ఔషధాలను పరీక్షించడంలో నైపుణ్యం అందించడంలో ఈ శిక్షణ చాలా ఉపయోగకరమన్నారు. క్రియాత్మక నైపుణ్యాలు ఔషధాల నాణ్యతను నిర్ధారించడానికి అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడమన్నారు. ప్రమాణాలను కనుగొనడం ఔషధ నాణ్యతను పరీక్షించేటప్పుడు ప్రమాణాలను కనుగొనడం నేర్చుకోవడం జరిగిందన్నారు. ఈ శిక్షణ ఔషధాల తయారీ, విశ్లేషణలో పనిచేసే వారి నైపుణ్యాలను మెరుగు పరచడానికి ఎంతో సహాయ పడుతుందని పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా విద్యార్థులు ఫార్మా రంగంలో వివిధ ఉద్యోగ అవకాశాలను పొందే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఇన్‌ఛార్జి మనోహర్ రెడ్డి, అపిటోరియా ఫార్మా, అరోబిందో ఫార్మా ఫౌండేషన్ బృందం పాల్గొన్నారు.


స్కిల్ డెవలప్‌మెంట్ సర్టిఫికేషన్ ప్రోగ్రాంలో ఎంఎస్‌సి విద్యార్థులు

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- పాతపట్నం

పాతపట్నం, మార్కెట్‌వీధికి చెందిన రాయబిల్లి రామకృష్ణ (38) మానసికంగా సరిగా లేక భార్య, పిల్లలతో మూడేళ్ల క్రితం నుంచి విడిగా ఉంటూ మద్యానికి అలవాటు పడ్డాడు. ఇటీవల హైదరాబాద్‌లో ఉండేవాడు. అతని తల్లి కూడా అక్కడే ఉంటుంది. రెండు నెలలుగా పాత పట్నంలో సొంత ఇంటిలో ఒంటరిగా ఉంటున్నాడు. డిప్రెషన్‌లో ఇంటిలో ఫ్యాన్ హుక్‌కు ఉరి వేసుకుని చనిపోయినట్లు మృతుని తల్లి రాయబిల్లి శ్రీలక్ష్మి ఇచ్చిన ఫిర్యాధుపై ఎఎస్‌ఐ అప్పారావు కేసుని నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గురుగుబిల్లి మాజీ సర్పంచ్ మృతి

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని గురుగుబిల్లి మాజీ సర్పంచ్ బాడిత లక్ష్మి (85) బుధవారం అర్ధరాత్రి మృతి చెందారు. ఇటీవల కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. లక్ష్మి 2013 పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసి సర్పంచ్‌గా గెలుపొందారు. అప్పటి నుంచి 2018 వరకు సర్పంచ్‌గా ఐదేళ్లపని చేసి గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశారు. ఈమెకు నలుగురు కుమార్తెలు, ముగ్గురు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు బాడిత రాంబాబు వైసిపిలో క్రియాశీలక నాయకునిగా కొనసాగుతున్నాడు. మృతి విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల నియోజకవర్గ వైసిపి నాయకులు పిన్నింటి సాయికుమార్, ఎంపిపి డి.రాజీనాయుడు, ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, మాజీ సర్పంచ్ ముప్పిడి మురళీమోహన్, పలువురు సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు నివాళ్లర్పించారు.

పశువుల రవాణా అడ్డగింత

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని శిలగాం జాతీయ రహదారి ఫ్లైఓవర్ వద్ద గురువారం తెల్లవారు జామున రెండు గంటల సమయంలో పశువుల అక్రమ రవాణాను కవిటి పోలీసులు అడ్డుకుని 14 గేదెలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కవిటి ఎస్‌ఐ రవివర్మ అందించిన సమాచారం మేరకు నరసన్నపేటకు చెందిన రెడ్డి శ్రీనివాస్ అనే వ్యక్తి ఒడిశా రాష్ట్రం గొలాంతర నుంచి 14 గేదెలను కొనుగోలు చేసి రెండు బొలెరో పికప్ వాహనాల్లో తిలారు సంతకు తరలిస్తుండగా శిలగాం ఫ్లైఓవర్ వద్ద తనిఖీల్లో భాగంగా అక్రమ రవాణా అడ్డుకున్నట్టు తెలిపారు. అనంతరం రెండు బోలేరా వాహనాలు స్వాధీనం చేసుకుని ఆరుగురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. అలాగే గేదెలను కొత్తవలస హెల్పింగ్ హాండ్స్ సంస్థకు అప్పగించినట్లు తెలిపారు.

ముగిసిన వికసిత కృషి సంకల్ప అభియాన్

నరసన్నపేట: కృషి విజ్ఞాన కేంద్రం ఆమదాలవలస, వ్యవసాయ శాఖ శ్రీకాకుళం సంయుక్తంగా నిర్వహిస్తున్న వికసిత కృషి సంకల్ప అభియాన్ నేటితో ముగుస్తుందని డాక్టర్ హరికుమార్ తెలిపారు. గురువారం లింగాల పాడులో నిర్వహించారు. ఈ సందర్భంగా హరికుమార్, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కార్యక్రమ ఆవశ్యకతను రైతులకు వివరించారు. కార్యక్రమంలో పరిశోధనా మండలి శాస్త్రవేత్త డాక్టర్ ఆనందిత పాల్ పసుపు, వ్యవసాయ పరిశోధన స్థానం ఆమదాలవలస శాస్త్రవేత్త డా. వై.సంధ్యా రాణి, విఎఎ అనంత హారిక, రైతులు పాల్గొన్నారు.

16లోగా విధుల్లో చేరాలి

నరసన్నపేట: మండలం ఈదులవలసలో ఉన్న ఎపి మోడల్ కళాశాలలో ఈ ఏడాది దరఖాస్తు చేసుకుని ఎంపికైన వారు ఈనెల 16లోగా విధుల్లో చేరాలని ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ తెలిపారు. గురువారం కళాశాలలో విలేకరులతో మాట్లాడారు. 16వ తేదీకి రిపోర్ట్ చేయని విద్యార్థులు సీట్లు కేన్సిల్ చేయబడతాయని, ఈ విషయం గమనించాలని కోరారు.

ఉపాధి పనులు కల్పించాలి

బూర్జ: గ్రామంలో ఉపాధి పనులు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని వేతనదారులు కోరారు. మండలంలోని అల్లెనలో ఉపాధి హామీ పథకం పనులపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కూలీలు సోషల్ ఆడిట్ సిబ్బంది దృష్టికి పలు సమస్యలను తీసుకువచ్చారు. కూలీలు పనులు లేక పస్తులు ఉండాల్సిన పరిస్థితి వస్తుందని తెలిపారు. వందరోజుల పని కల్పిస్తామని చెప్పినప్పటికీ ఇంతవరకు పనులు కల్పించడం లేదని ఆరోపించారు. పనికి తగ్గ వేతనం కూడా అందడం లేదని, ముఖ్యంగా ఉపాధి పనుల్లో పలు అవకతవకలు చోటు చేసుకుంటున్నాయని కూలీలు తెలిపారు. అల్లెన సర్పంచ్ జడ్డు మహేశ్వరరావు, మాజీ సర్పంచ్ బాల చంద్ర మౌళీశ్వరరావు, టిడిపి మండల సోషల్ మీడియా అధ్యక్షులు వారాడ రాంబాబు, ఆడిట్ సిబ్బంది, ఎస్ఆర్‌పిలు అచ్యుతారావు, గోవిందరావు, రాజేంద్రతో పాటు డిఆర్‌పిలు శ్రీరామ్మూర్తి, సింహాచలం, ఆర్.రమేష్ మండలంలోని లాభాం, వైకుంఠపురం గ్రామాల్లో ఉపాధిహామీ అవగాహన సదస్సులు నిర్వహించారు.

చంద్రబాబు వ్యాఖ్యలపై హర్షం

రణస్థలం రూరల్: జాతీయ భాష హిందీని గుర్తించాలని, హిందీని తప్పనిసరిగా నేర్చుకోవాలన్న సిఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలను పలు హిందీ మంచ్ ప్రతినిధులు స్వాగతించి హర్షం వ్యక్తం చేశారు. హిందీ మంచ్ వ్యవస్థాపకులు కోనే శ్రీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రొంపివలస రామారావు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. జాతీయ భాష హిందీ అవసరం, అవశ్యకత, ఉపయోగాలపై సిఎం చంద్రబాబు స్వయంగా ట్వీట్ చేశారని ప్రతినిధులు తెలిపారు. ప్రాంతీయ భాషలను నేర్చుకోవడం, గౌరవించడం ఎంత ముఖ్యమో, జాతీయ భాష హిందీని నేర్చుకోవడం అంతే అవసరమన్న అభిప్రాయం సిఎం చంద్రబాబు దూరదృష్టికి నిదర్శనమని ప్రతినిధులు పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు విద్యార్థి దశలోనే హిందీ భాషను నేర్పించాలని ప్రతినిధులు పిలుపునిచ్చారు.


డిఇకి వినతిపత్రం అందజేస్తున్న ప్రజలు

లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలి

టెక్కలి రూరల్: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలోని ఆధిఆంధ్రావీధిలో నెలకొంటున్న విద్యుత్ లోఓల్టేజీ సమస్యపై గురువారం విద్యుత్‌శాఖ డిఇ శంకరరావుకు అదిఆంధ్ర వీధి ప్రజలు వినతిపత్రం అందించారు. టెక్కలి పట్టణంలో అతిపెద్ద వీధిగా ఉన్న ఆధిఆంధ్రా వీధిలో తరుచూ లోఓల్టేజీ సమస్య వేధిస్తోందని, సమస్యను పరిష్కరించాలని కోరారు. దీని వలన రోజువారి పనులకు ఆటంకం కలుగుతోందన్నారు. కార్యక్రమంలో యాగాటి శివరాం, యర్ర వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపిపి శ్రీరామ్మూర్తి

సాంబమసూరి ఎప్పుడు కొంటారు?

ప్రజాశక్తి- నందిగాం

ఈ ఏడాది పండించిన గ్రేడ్ ఏ రకమైన సాంబ మాసూరి ఇప్పటికీ రైతు కళ్లాల్లో మూలుగు తున్నాయని వాటిని ఎప్పుడు కొంటారని పలువురు సభ్యులు ప్రశ్నించారు. మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించారు. ముందుగా వ్యవసాయ అధికారి శ్రీకాంత్ వర్మ మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు వరి విత్తనాలు అందించామని, రైతుల అవసరాన్ని గుర్తించి మరో రెండు వందల క్వింటాలకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. ప్రైవేట్ సీడ్ కోసం ప్రైవేట్ డీలర్లను ఆశ్రయిస్తున్నారని, స్వర్ణకు అనుబంధ రకాలైన సీడ్లను రైతుసేవా కేంద్రాల్లో అందిస్తే బాగుంటుందని సభ్యులు పోలాకి మోహనరావు పుష్య సత్యం తదితరులు కోరారు. వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో డిఎపి 200 టన్నులు, యూరియా అందుబాటులో ఉందన్నారు. సాగుదారుల హక్కు పత్రాలు 552 టార్గెట్ కాగా ఇప్పటి వరకు 60 మాత్రమే చేశామన్నారు. సభ్యులు సత్యం ప్రభుత్వ పథకాలు అందించేటప్పుడు ప్రజాప్రతినిధులకు ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. అనంతరం ఉపాధిహామీపై ఎపిఒ నాగరాజు మాట్లాడుతూ ఫారం పనిలో 360 టార్గెట్ కాగా ఇప్పటివరకు 250 పూర్తి చేశామన్నారు. రూ.307 వేతనం కాగా సగటున వేతనం 234 వస్తుందని తెలిపారు. మండలంలో దొంగ మస్టర్లు వేసి వేతనదారుల నుంచి లంచాలు వసూలు చేస్తున్నట్లు సభ్యులు ఎర్ర చక్రవర్తి, పి.ఆశారాణిలు ప్రశ్నించారు. దీనిపై దర్యాప్తు నిర్వహించాలని కోరారు. ఎంపిపి శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ మండలంలో ఉన్న 37 పంచాయతీల్లో ఉపాధిహామీలో జరిగిన అవినీతిపై విజిలెన్స్ ద్వారా ఎంక్వయిరీ చేయించేందుకు మండల పరిషత్ తీర్మానం చేసిందని, అలాగే జిల్లా కలెక్టర్‌ను కోరనున్నట్లు ఆయన తెలిపారు. తహశీల్దార్ సోమేశ్వరరావు మాట్లాడుతూ కొత్త రేషన్ కార్డు దరఖాస్తు చేసుకోవడానికి రేషన్ కార్డులో యాడింగ అవకాశం ఉందని, దానిని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కుమార్ పట్నాయక్, ఇఒపిఆర్‌డి రాజారావు, మండల ఇంజనీరింగ్ అధికారి సంతోష్ కుమార్, డిప్యూటీ తహశీల్దార్ రామారావు, వ్యవసాయ అధికారి శ్రీకాంత్ వర్మ, మండల హౌసింగ్ ఎఇ నవ్య తదితరులున్నారు.

బాలలు బడిలోనే ఉండాలి

పలాస: బాలలందరూ బడిలోనే ఉండాలని వీధుల్లో, పరిశ్రమలో వారికి స్థానం ఉండకూడదని సివిల్ జడ్జి కోర్ట్ న్యాయమూర్తి యు.మాధురి అన్నారు. మండల న్యాయ సేవా సంఘం, జూనియర్ సివిల్ జడ్జి అధ్యక్షతన గురువారం కాశీబుగ్గ బాలసదన్‌లో ప్రత్యేక న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ బాలలందరూ బడిలో ఉండాలని, బాలల స్థానం వీధుల్లోను, పనుల్లోనూ కాదని అందుకనే బాలల వ్యతిరేక దినోత్సవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎక్కడైనా బాలలు కనిపిస్తే ఐదు సంవత్సరాలలోపు వరకు స్థానిక అంగన్వాడీ కేంద్రాల్లోనూ, ఐదు సంవత్సరాలు దాటిన పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో బార్ ఉపాధ్యక్షుడు బికెఆర్ పట్నాయక్, జాయింట్ సెక్రెటరీ జిఎంఎస్ అనిల్ రాజు, ట్రెజరర్ రవికుమార్, లోకేష్, తహశీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి, ఎంఇఒ శ్రీనివాస్, పారా లీగల్ వాలంటరీ సునీల్ కుమార్, బాలసదన్ ఇన్‌ఛార్జి సునంద దేవి తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి: సమాజంలో అభివృద్ధికి ఆటంకంగా ఉన్న బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాల్సిన అవసరం ఎంతైనా ఉందని టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు అన్నారు. బాలకార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో పలు దుఖానాల్లో తనిఖీలు చేపట్టారు. బాలలను పనిలో పెట్టుకున్నా నేరమన్నారు. బాలలను పనిలో పెట్టుకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్మిక సహయ అధికారి ఆర్.రాధాకుమారి ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు పినకాన అజయ్‌కుమార్, న్యాయవాదులు మెట్టగోవింద్, పోట్నూరు ఆనందరావు, పైలచంద్రుడు, ఎస్.ధర్మరాజు, బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం సిటీ: బాలకార్మిక వ్యవస్థ సమాజానికి అనర్థంగా ఉందని లయిన్స్ క్లబ్ సెంట్రల్ జోన్ చైర్మెన్ పొన్నాడ రవికుమార్ ప్రకటనలో అన్నారు. పిల్లలు బడిలో ఉండాలని, బాలకార్మిక వ్యవస్థ రహిత సమాజంతో ప్రగతి సాధ్యంగా చెప్పారు. చదువుతోనే బాలల భవిష్యత్ సాధ్యమన్నారు.

రత్తకన్నలో రోడ్లు, కాలువలు నిర్మించాలి


కమిషనర్ రమేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపాలిటీ పరిధిలో ఉన్న రత్తకన్నలో 20వ వార్డులో కనీస సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నామని వార్డు మహిళలు మున్సిపల్ కమిషనర్ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. తమ వార్డులో దేవంగుల వీధిలో రోడ్లు, కాలువలు లేకపోవడం, చిన్న చినుకు పడినా రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఇప్పటికే అనేక సార్లు ప్రజా ప్రతినిధులు దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని, తక్షణమే అధికారులు వార్డును పరిశీలిస్తే సమస్యలు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పీతాంబర రెడ్డి, హరి ప్రసాద్ రెడ్డి, పార్వతి, దమయంతి, బుడ్డెమ్మ, లక్ష్మి, సాయమ్మ, విమల, లలితా తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపు తొలగించాలి

గ్రామస్తుల ఆందోళన

ఇచ్ఛాపురం: మండలంలో ఈదుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో కొత్తగా ఏర్పాటు చేసిన మద్యంషాపు వలన విద్యార్థుల భవిష్యత్ అగమ్యగోచరంగా తయారైందని గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సెలవు దినాల్లో ఎవరితో సంప్రదించకుండా స్కూల్‌కి అతి దగ్గరలో మద్యం షాపును ఒక కంటైనర్‌లో ఏర్పాటు చేసి ప్రారంభించడంతో ఒక్కసారిగా గ్రామస్తుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. షాపు కేసుపురం పంచాయతీకి చెందిన స్థలంలో ఏర్పాటు చేశారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్, ఎక్సైజ్ అధికారులకు మద్యం షాపు తొలగించాలని వినతిపత్రం అందించడం జరిగిందని సర్పంచి నర్తు వరప్రసాద్, ఎస్ఎంఎస్ చైర్మన్ ఎస్.నరసింహ మూర్తి, మండల వైస్ ఎంపిపి వివేకానంద రెడ్డి తెలిపారు. స్కూల్‌కి అతి దగ్గరలో మద్యం షాపు ఉండడం వల్ల స్కూల్ అడ్మిషన్లు తగ్గుముఖం పట్టిందన్నారు. అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో గురువారం స్కూల్‌లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున ర్యాలీ చేస్తూ మద్యం షాపు వద్ద నినాదాలు చేస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న సిఐ మీసాల చిన్నం నాయడు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులో తీసుకోని వచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన మద్యం షాపు తొలగించాలని డిమాండ్ చేశారు.


మద్యం షాపు తొలగించాలని ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

ఎక్సైజ్ సిఐ బాధ్యతల స్వీకరణ


రమణ, ఎక్సైజ్ సిఐ

ప్రజాశక్తి- సోంపేట

సోంపేట ఎక్సైజ్ సిఐగా జి.వి రమణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సిఐగా పనిచేసిన కె.బేబీ బదిలీపై వెళ్లడంతో సోంపేట, ఇచ్ఛాపురం పరిధిలో మొబైల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన జి.వి రమణ పదోన్నతిపై సిఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్సైజ్ పరిధిలో నాటుసారా రహిత ప్రాంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది ఆహ్వానం పలికారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని చీపురుపల్లి కేంద్రంలో 22 రోజు ఆఫ్‌సోర్ నిర్వాసితులు రిలే దీక్షలకు నిర్వాసితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గంగరాజు సింహాచలం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ గురువారం సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితుల సమస్యలను పరిష్కారం చేయడంలో పాలకులు నిర్లక్ష్యం చేయడం అన్యాయమని ఆందోళన వ్యక్తం చేశారు. ఆఫ్‌షోర్ నిర్వాసితుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిర్వాసితుల హక్కులసాధన కోసం నిర్వాసితులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆఫ్‌షోర్ నిర్వాసితుల సంఘం నాయకులు, సర్పంచ్ యవ్వారి ఈశ్వరరావు, కొక్కిరి కిరణ్, వెంకటరమణ నందిగాం ఉమాశంకర్, దొరశంకర్, బాలాజీ, కవిటి శోభనబాబు, రాజాన మహలక్ష్మి, గుంట సరోజనమ్మ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సింహాచలం



మాట్లాడుతున్న కమిషనర్ రామారావు

పైపులైన్ల సర్వేను వేగవంతం చేయాలి

పలాస: కొత్త పైపులైన్ల సర్వేను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ ఇంజనీర్లు, ఎమినిటీ కార్యదర్శులు, మున్సిపల్ వాటర్ సప్లై సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీకు 8 ఎంఎల్‌డి తాగునీరు అవసరం కాగా ఉద్దానం పైపులైన్ ద్వారా వస్తున్న ఐదు ఎంఎల్‌డిను జంట పట్టణాలకు తాగునీరు ఎలా సరఫరా చేయాలి, ప్రతి ఇంటికి ఎలా అందించాలి తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. దీంతో రూ.3 కోట్లు ప్రతిపాదనలతో పూర్తిగా సరఫరా కాని ప్రాంతాలను ఎంపిక చేయడం జరిగిందని, పైపులైన్లు లేని ప్రాంతాలను గుర్తించామని ఆయా ప్రాంతాల్లో ట్యాంకులు నిర్మించి తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. సమావేశంలో డిఇ కనకరాజు, ఎఇ కిరణ్ కుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైసిపి నాయకులు

వెనుకబడిన జిల్లా అనడానికి సిగ్గు లేదా?

టెక్కలి రూరల్: శ్రీకాకుళం జిల్లాలో 40 ఏళ్లలో ఎక్కువసార్లు గెలిచిన మీరు ఈ జిల్లాను వెనుకబడిన జిల్లా అనడానికి అచ్చెన్నాయుడుకు సిగ్గు లేదా అని వైసిపి నాయకులు ప్రశ్నించారు. గురువారం టెక్కలి వైసిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ జిల్లాలో ఎక్కువ కాలం కింజరాపు కుటుంబమే పరిపాలించారని, జిల్లాకి శ్వాశత ఒక ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారా అని విమర్శించారు. సాక్షి కార్యాలయంపై దాడులు, వైసిపి నాయకులపై కేసులు పెట్టడమే టిడిపి నాయకుల పనిగా ఉందని, అభివృద్ధిపై దృష్టి ఎక్కడైనా పెట్టారా ప్రశ్నించారు. ఇప్పటికైనా ఇలాంటి పనులు మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో ఎంపిపి అట్ల సరోజనమ్మ, మండల పార్టీ అధ్యక్షులు సంపతరావు హేమసుందరరాజు, మోహన్ రెడ్డి, బాలక మధు, జోగారావు తదితరులున్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపిక

సోంపేట: స్థానిక సంస్కార భారతి విద్యాసంస్థల్లో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న గరుడాచలం ప్రియా నందు ఇటీవల విశాఖపట్నంలో జరిగిన క్యాంపస్ సెలక్షన్లలో టాటా కన్సల్టెన్సీ సర్వీస్ కంపెనీలో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ప్రియానందు టిసిఎస్‌లో ఉద్యోగానికి ఎంపిక కావడంపై కళాశాల చైర్మన్ దేవరాజు, కరస్పాండెంట్ ఎన్.దాసు, ప్రిన్సిపాల్ శ్రీరామ్మూర్తి, కవిబాబు, ఎఒ పాపారావు, అధ్యాపక సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

బాహుదా బట్టి మరమ్మతులకు భూమిపూజ



బట్టి పనులకు భూమి పూజ చేస్తున్న కామేశ్వరరావు

ఇచ్ఛాపురం: మండలం కేసుపురం నీటి సంఘం అధ్యక్షులు దక్కత కామేశ్వరరావు, మాజీ ఎంపిపి దక్కత ఢిల్లీరావు బాహుదా పెద్దబట్టి మరమ్మతు పనులకు గురువారం భూమి నిర్వహించారు. నీటి సంఘం అధ్యక్షులు అభ్యర్థన మేరకు రూ.4 లక్షలు మంజూరైందని, నీటి సంఘం అధ్యక్షులు ఆధ్వర్యంలో ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బి.అశోక్, ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు సహకారంతో వివిధ పనులు మరమ్మతులకు నిధులు మంజూరైన సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నీటి సంఘం ఉపాధ్యక్షులు పిట్ట పురుషోత్తం, కమిటి సభ్యులు నీలాపు హరికృష్ణ, బుడత తిరుపతి, పిట్ట వాసుదేవ్, కేసుపురం, సన్యాసి పుట్టుగ, నీలాపు పుట్టుగ గ్రామాల పెద్దలు సూరు కామరాజు, గుజ్జు భీమరాజు, నరేంద్ర రెడ్డి, మాసుపత్రి నీలాద్రి, మాసుపత్రి శంకర్, నీలాపు చంద్రమణి రెడ్డి, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ



కోటబొమ్మాళి : విద్యార్థులకు కిట్లును పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

కోటబొమ్మాళి: మండలం కొత్తపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లును గురువారం స్థానిక టిడిపి నాయకులు పంపిణీ చేశారు. పాఠశాలలు తెరుచుకునే మొదటి రోజే విద్యార్థులకు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో స్కూల్ బ్యాగ్, పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, రెండు జతల ఏకరూప దుస్తులు, బూట్లు ఇతర సామగ్రి పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మునగవలస శ్రీనివాసరావు, స్కూల్ కమిటీ చైర్మన్ మక్క నారాయణ, మాజీ ఎంపిటిసి మక్క లక్ష్మణరావు, కింజరాపు యువసేన సభ్యులు ధర్మాన నాగరాజు, జీరు రామకృష్ణ, దాసరి కృష్ణవర్ధన్, సిరిపిల్లి అప్పన్న పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధిలో గల గర్ల్స్ హైస్కూల్‌లో స్కూల్స్ పున్న ప్రారంభంలో భాగంగా విద్యార్థులకు పుస్తకాలు, కిట్లు పంపిణీ కార్యక్రమాన్ని జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు చేతుల మీదగా జరిగింది. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, కూటమి నాయకులు. కృష్ణయ్య, వెంకట రమణ, జనసైనికులు, వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం: విద్యార్థినికి కిట్టు పంపిణీ చేస్తున్న రాజు

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

ప్రజాశక్తి- లావేరు

బుడుమూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని గురువారం బుడుమూరులో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో తల్లిదండ్రులతో ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను ఉపాధ్యాయులు వివరించారు. 16 మంది విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించుటకు అంగీకరించారు. ఈ సందర్భంగా నాణ్యమైన విద్యను అందిస్తామని హామీఇచ్చారు. హెచ్‌ఎం రుప్ప పూర్ణచంద్రరావు, ఉపాధ్యాయులు ఎస్.కె. ప్రసాదరావు, పూజారి గోవిందరావు, కె.వెంకటరావు, పడాల తమ్మినాయుడు, కూన చిన పెంటయ్య, సీర రమేష్ బాబు పాల్గొన్నారు.

పాలఖండ్యాంలో పదిమంది చేరిక

శ్రీకాకుళం: జి.సిగడాం మండలం పాలఖండ్యాం పాఠశాల పున్నప్రారంభమైన నేడు ఒకటో తరగతిలో పదిమంది పిల్లలు నమోదైనట్లు హెచ్‌ఎం రుద్రపాటి లక్ష్మి కుమారి తెలిపారు. తొలుత స్థానిక అంగన్వాడీ కార్యకర్త నుంచి ఐదేళ్లు నిండిన ఒకటో తరగతికి అర్హతగల పిల్లల వివరాలను సేకరించగా, మరో వైపు గ్రామంలో పర్యటించి మరికొందరి వివరాలను సేకరించగా మొత్తం 10 మంది విద్యార్థులు చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుదమ తిరుమలరావు, ఉప్పలపాటి ఆదిలక్ష్మి, యందువ వెంకటరమణ, వెలగాడ రాము, భూసిరెడ్డి కృష్ణవేణి, చిప్పాడ భవాని, జిఎంఆర్ విద్యా వాలంటీర్ పిల్లల దాలమ్మ, సచివాలయ కార్యదర్శి దూబ రంజిత్ కుమార్, గ్రామ పెద్దలు పెద్ది సత్యం, పలిశెట్టి సూర్యనారాయణ, అంగన్వాడీ కార్యకర్త కుప్పిలి లక్ష్మి, బాలబడి కేంద్ర బోధకురాలు దారబోయిన జ్యోతి, ఆయా గుంటిబాని చిన్నమ్మడు తదితరులు పాల్గొన్నారు.



లావేరు : తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని పొందూరు, లోలుగు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గల గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని విద్యుత్ శాఖ ఇఇ పైడి యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్ స్టేషన్ పరిధిలో గల విద్యుత్ లైన్‌లకు అడ్డుగా ఉన్న చెట్లు కొమ్మలు తొలగించడంతో పాటు ఇతర మరమతులు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందని, ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోతరారు.

పాతపట్నం: పాతపట్నం మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పాతపట్నం విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని దశరథిపురం, బైరాగిపేట, తిడ్డిమి, రంకిని, సూర్యనారాయణపురం, దాసుపురం తదితర గ్రామాల పరిధిలో భాగంగా ఆర్‌డిఎస్ఎస్ ప్రాజెక్ట్ పరిధిలో గల విద్యుత్ లైన్ నిర్మాణం నిమిత్తం, పాతపట్నం టౌన్ పరిధిలో అంతరాబ, బిఎస్ఎఫ్ కాలనీ, సరాళి రోడ్‌లో బ్రిక్ ఇండస్ట్రీ, ఫారెస్ట్ ఆఫీస్ ఏరియాలో లైన్‌కు దగ్గరగా ఉన్న చెట్లు తొలగించుటకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు.

శ్రీకాకుళం సిటీ: శ్రీకాకుళం నగరంలో పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఇఇ పి.యోగేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. పిఎన్ కాలనీ ఫీడర్ నిర్వహన పనులు చేయనున్నట్లు చెప్పారు. పిఎన్‌కాలనీ, కిమ్స్, బైరవానిపేట, సీపన్నాయుడు పేట ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.



పనులను పరిశీలిస్తున్న కాలనీవాసులు

చందాలతో సిమెంట్ ర్యాంపు నిర్మాణం

టెక్కలి రూరల్: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలో స్థానిక శ్రీరామ కాలనీలో నివసిస్తున్న గృహ యజమానులు చాలా సంవత్సరాల నుంచి పంచాయతీ ఆఫీస్ చుట్టూ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి చుట్టూ తమ కాలనీలో రోడ్డు నిర్మాణం చేపట్టాలని తిరిగి తిరిగి ప్రభుత్వ అధికారులు ఎవరూ స్పందించడం లేదని తలచి, కాలనీవాసులు తిరిగే రోడ్డు మార్గాన్ని చందాలు పోగు చేసి రోడ్డును వాళ్లే దగ్గరుండి బాగు చేయించుకుంటున్నారు. కొన్నేళ్ల క్రితం డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నప్పుడు చందాలు పోగు చేసి సిమెంట్ పైపులతో డ్రైన్ నిర్మాణం పూర్తి చేశారు. ఇదే మార్గంలో శ్రీరామ కాలనీవాసులతో పాటు విశ్వజ్యోతి డిగ్రీ కళాశాల విద్యార్థులు అనునిత్యం ఈ మార్గం గుండా సైకిల్, ద్విచక్ర వాహనాలతో కళాశాలకు వెళ్లి వస్తుంటారు, విద్యార్థులకు బన్నువాడ రోడ్డు సదుపాయం ఉన్నప్పటికీ సుదూర ప్రాంత విద్యార్థులు శ్రీరామ కాలనీ గుండా విశ్వ జ్యోతి కళాశాలకు చేరుకుంటారు. ఈ మార్గం గుండా విద్యార్థులు వాహనాలతో వచ్చినప్పుడు పడిపోయిన సందర్భాలు కోకొల్లలు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని కాలనీవాసులు చందాలు పోగు చేసి చిప్స్, ఇసుక, సిమెంట్ సొంతంగా కొనుగోలు చేసి సిమెంట్ ర్యాంపు నిర్మాణం పూర్తి చేస్తున్నారు. అందుకు కాలనీవాసులు తరుపున దగ్గరుండి సిమెంట్ ర్యాంపు నిర్మాణం మేస్త్రిలతో చేయిస్తున్న మొగలుపురి సతీష్ కుమార్, యజ్జల ఊర్వరావు, అంబటి రమ, మొగిలిపురి సంధ్య, యజ్జల గుణవతిలను కాలనీ వాసులు అభినందించారు.



వినతిపత్రం అందజేస్తున్న గొండ్యాలపుట్టుగ గ్రామస్తులు

మెడికల్ షాపుపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి- కవిటి

ఆర్‌అండ్‌బి రహదారికి అనుకుని షాపు నిర్మించడమే కాకుండా గడువు ముగిసిన మందులు విక్రయిస్తూ ప్రజల ప్రాణాలకు హాని కలిగిస్తున్న ఆశిష్ మెడికల్ షాపు యజమాని, ఆర్.ఎం.పి బిటి ప్రసాద్‌పై చర్యలు తీసుకుని, తక్షణమే మెడికల్ షాపు తొలగించేలా చర్యలు తీసుకోవాలని మండలంలోని గొండ్యాల పుట్టుగకు చెందిన మరిడి బాలరాజుతో పాటు పలువురు గ్రామస్తులు గురువారం తహశీల్దార్ మురళీ మోహన్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రోడ్లు, భవనాల శాఖకు చెందిన స్థలంలో మెడికల్ షాప్ నిర్మించడంతో నిరంతరం అశోక సినిమా హాల్ నుంచి ఈదుపురం వెళ్లే రహదారిలో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతున్నట్లు తెలిపారు. అంతేకాకుండా మెడికల్ షాప్ యజమాని ప్రసాద్ సొంత వైద్యం చేస్తూ గడువు ముగిసిన మందులతో చాలామంది ప్రాణాలతో చెలగాటమాడుతున్నట్లు ఆరోపించారు. అధికారులు తక్షణమే దీనిపై స్పందించి మెడికల్ షాపు లైసెన్స్ రద్దు చేయడమే కాకుండా ఆర్‌అండ్‌బి రహదారి నుంచి దానిని తొలగించాలని సదర వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో దుద్ది లక్ష్మణ్, మరిడి శ్యామల, ఆనంగి చంద్రమ్మ, మోహనరావు, రామ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

విరివిగా మొక్కలు నాటాలి

ప్రజాశక్తి- పలాస

వర్షాకాలంలో విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని రెంటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ మౌనిక అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండలం రెంటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, శివాలయం ఆవరణలో కాము, జాము, మారేడు వంటి మొక్కలు గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యంలో నాటారు. గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్ మాట్లాడుతూ కరోనా మహమ్మారి అనంతరం ప్రపంచ వ్యాప్తంగా అనాధలు పెరిగారని, వీరంతా బాల కార్మికులగా మారారని, ప్రభుత్వం బాల కార్మికులను గుర్తించి వారికి సరైన వసతులు కల్పించి నాణ్యమైన విద్యను కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిహెచ్ఒ ఆదెమ్మ, పిహెచ్ఎన్ సత్యవతి, సూపర్‌వైజర్లు రిషికేశ్వరరావు, ఈశ్వరమ్మ, మేరీబాయ్, రాజేశ్వరి, త్రివేణి, భరద్వాజ్, నిహారిక, లీలావతి రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులు కోరిన విత్తనాలు అందిస్తాం

ప్రజాశక్తి- సోంపేట

ఖరీఫ్ సీజన్‌లో రైతులు కోరుకున్న విత్తనాలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎఒ నరసింహమూర్తి అన్నారు. స్థానిక వ్యవసాయ శాఖ గోడౌన్ వద్ద గురువారం నిర్వహించిన విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీడ పీడలు తట్టుకునే నూతన వంగడాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎస్.చంద్రమోహన్, ఎం.నాగేశ్వరరావు, సిహెచ్ శ్రీను, సిహెచ్ శేఖర్, బి.వంశీ, వి.గాంధీ, ఎన్.గోపాల్, బి.ఆనంద్, ఎం.రవి, స్థానిక రైతులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

శ్రీకాకుళం సిటీ: ప్రతి రోజు యోగాసనాలు వేయటం వలన మానసిక ఒత్తిడి దూరమవుతుందని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి జి. సూర్య ప్రకాష్ తెలిపారు. నగరంలో గురువారం ఎనబై అడుగుల రహదారిలో పౌర సరఫరాల శాఖ అధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. యోగా శిక్షకులు మురళీకృష్ణ, స్వాతి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేత్ర వైద్యశిబిరానికి స్పందన

రణస్థలం: కంటి ఆరోగ్యానికి జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని కళ్యాణి కంటి ఆస్పత్రి అప్తాలమిక్ ఆఫీసర్ ఎస్.కళ్యాణి అన్నారు. కళ్యాణి కంటి ఆస్పత్రి ఆవరణలో గురువారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి 155 మంది హాజరయ్యారు. వైద్య పరీక్షలు నిర్వహించి 22 మందిని శస్త్రచికిత్సల కోసం ఎంపిక చేసి శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా కళ్యాణి మాట్లాడుతూ కంటిచూపు మసక బారటం, కంటి నొప్పి, కళ్లముందు మెరవడం వంటి లక్షణాలుంటే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

నందిగాం: విద్యార్థులు తన భవిష్యత్ లక్ష్యాన్ని నిర్దేశించుకుని విద్యార్జనలో ముందంజలో ఉండాలని ఎంఇఒ అన్నుపురం చిన్నారావు అన్నారు. లఖిదాసుపురం జిల్లాపరిషత్ పాఠశాలలో చదివి పదవతరగతి ఫలితాల్లో మండల స్థాయిలో ద్వితీయస్థానం సాధించి షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికైన విద్యార్థి బాలక జశ్వంత్‌సాయి అభినందన సభ గురువారం నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం చిలుకు కృష్ణారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పదోతరగతిలో మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేశారు. మాజీ సర్పంచ్ మాదిన లోకనాథం, విద్యాకమిటి చైర్మన్ చమళ్ల సీతారాం, పాఠశాల ఉపాధ్యాయులు కురమాన దాలయ్య, తులసీ ప్రసాద్, వై.నాగేశ్వరరావు, ఎన్.గోవిందరావు, యాగాటి త్రినాధరావు, బెందాళం రత్నం, ప్రియదర్శిని, విద్యార్థులు పాల్గొన్నారు.

పళ్లతోటల పెంపకంతో ఆర్థిక స్వావలంబన

ప్రజాశక్తి- రణస్థలం

రైతులు సమీకృత పండ్ల తోటల పెంపకం చేపట్టడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు ఆర్థిక స్వావలంబన కూడా సాధించవచ్చని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు అన్నారు. గురువారం మండలంలోని వెంకటరావుపేటలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ నర్సరీ నందు రైతులకు వివిధ రకాల పండ్ల మొక్కలు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూతాపంతో వాతావరణ మార్పులు సంభవిస్తున్న ప్రస్తుత తరుణంలో విరివిగా వనాల పెంపకం చేపట్టడం తక్షణ అవసరమన్నారు. రైతులు తమకున్న వ్యవసాయ భూమిలో కొంత భాగాన్ని పండ్ల తోటల పెంపకానికి కేటాయించినట్లైతే జీవ వైవిధ్యాన్ని కాపాడటమే కాక, ఆహార భద్రతతో పాటు, రెట్టింపు ఆదాయాన్ని కూడా పొందవచ్చని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏరియా మేనేజర్ బి.లక్ష్మి నరసింహ మూర్తి, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సీనియర్ ఏరియా మేనేజర్ పి.తవిటి నాయుడు, సమన్వయ కర్తలు బి.రామస్వామి, పి.నారాయణరావు, రైతులు పాల్గొన్నారు.



పళ్ల మొక్కలు పంపిణీ చేస్తున్న రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధులు